www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00


Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 6 | బుధవారం | 19 జూన్ 2024



ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్‌కు టీమిండియా బంపర్ ఆఫర్?

8 లో..



# ఐటీఐలను ఐటీసీలుగా మార్పు

## ఆధునిక శిక్షణకు చర్యలు

- టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకు ఒప్పందం
- విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి
- మల్లేపల్లి ఐటీఐ ఆధునీకరణకు శంకుస్థాపన

ఖైరతాబాద్, ప్రజానావ: ప్రస్తుతం ఐటీఐల్లో విద్యార్థులకు నేర్పించే నైపుణ్యాలు ఉపయోగం లేకుండా పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. 50 ఏళ్ల నాటి నైపుణ్యాలను ఐటీఐల్లో నేర్పిస్తున్నారని, అప్ గ్రేడ్ కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామని ప్రకటించారు. ఇందుకోసం టాటా సంస్థ సహకారం తీసుకుంటున్నామని వెల్లడిరచారు. విద్యార్థులు, నిరుద్యోగులను నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని వివరించారు. తన ఆలోచనల నుంచి వచ్చిందే ఏటీసీ సెంటర్స్ అని పేర్కొన్నారు. మేం పాలకులు, వీరీరు బానిసలు అనే ఆలోచన లేదు. మేం సేవకులం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 40 లక్షల మంది యువతీ యువకులు ఉపాధి లేక రిక్రూట్‌మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారు. సర్టిఫికెట్ ఉంటే సరిపోదు సాంకేతిక నైపుణ్యం ఉండాలి. సాంకేతిక నైపుణ్యం ఉంటే ఉపాధి లభిస్తుందని విశ్వసిస్తానని అన్నారు. సర్టిఫికెట్స్ జీవన ప్రమాణాలు పెంచవు. గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి గ్యారంటీ ఇస్తుంది.

మిగతా 2 లో



## పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

- హ్యాట్రిక్ విజయంతో మరోమారు ప్రధానిని చేశారు
- మీ ఆశలను వమ్ము చేయకుండా పనిచేస్తా
- గంగామాత దత్తత తీసుకోవడంతో మీలో ఒకడినయ్యా
- వారణాసిలో పర్యటించిన ప్రధాని మోడీ

వారణాసి, జూన్18: గంగా మాత తనను దత్తత తీసుకుందని, అందుకే తాను వారణాసివాసుల్లో ఒకరినయ్యానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కాశీ ప్రజలు తనను ఎంపీగా ఎన్నుకోవ డమే కాకుండా వరుసగా మూడోసారి ప్రధానిని చేశారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ప్రజాస్వామ్య దేశాల్లో మాత్రమే సాధ్యమన్నారు. 60 ఏళ్ల క్రితం ఇది జరిగిందని, అప్పటి నుంచి ఏ ప్రభుత్వం కూడా ఇప్పుడు సాధించిన హ్రాట్రిక్ సాధించలేదని చెప్పారు. ఎప్పటిలాగే ప్రజల కలలు, ఆంక్షాలను పండిచేందుకు తాను రేయింబవళ్లు

మిగతా 2 లో



## పుతిన్, కిమ్ కీలక భేటీ

- గత 24 ఏళ్లలో ఇదే తొలిసారి భేటీ
- సైనిక సహకారంపై చర్చ ఇరువురి చర్చలు

2 లో..



## ఫోన్ ట్యాపింగ్ కేసులో పురోగతి

సిట్ బృందానికి హార్డ్ డిస్క్‌లు లభ్యం

2 లో..



## శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

తనిఖీలు చేపట్టిన భద్రతా సిబ్బంది

2 లో..



## వైద్యశాఖలో ప్రక్షాళన

ఒకటి ,రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు

- ప్రతి 35 కిలోమీటరుకు ఒక ట్రామా సెంటర్
- కొత్తగా 75 ట్రామా కేర్ సెంటర్లు
- ప్రభుత్వ ఆస్పత్రులకు డయాగ్నోస్టిక్ సెంటర్ల అనుసంధానం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

2 లో..

## సిక్కింలో భారీ వర్షాలతో అతలాకుతలం

చిక్కుకుపోయిన 15వేల మంది పర్యాటకులు
500 మందిని రక్షించిన రెస్క్యూ టీం

2 లో..



## ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

- రూ.133.50 కోట్లు విడుదలకు సమ్మతి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, ప్రజానావ: రాష్ట్రంలో పెరిగిన పంట మార్పిడి ఆవశ్యకత దృష్ట్యా, తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు ,వివిధ ఉద్యాన పంటలలో సూక్ష్మ సేద్యం కొరకు రాయితీలు ఇస్తూ పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. 2023-24 సం.కి గాను 59,261 ఎకరాలు కొత్తగా ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగింది. 2023-24 సం.కి గాను ఆయిల్ పామ్ సాగు పథకం కింద, కేంద్ర ప్రభుత్వం రూ.80.10 కోట్లను విడుదల చేయడం జరిగింది. దీనికి రూ.53.40 కోట్ల రాష్ట్ర వాటా కలుపుకుని మొత్తం రూ.133.50 కోట్లు విడుదల చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగింది. ఈ మొత్తంలో 2023-24 సం.లో కేవలం రూ.32.72 కోట్లు మాత్రమే విడుదల చేయగా, వివిధ కారణాల చేత రూ.100.76

మిగతా 2 లో



## కించిత్ తప్పు జరిగినా చర్యలు తీసుకోవాలి

- విద్యార్థుల ఆందోళనలపై స్పందించాలి
- తప్పు జరిగితే చర్యలకు వెనకాడరాదు
- జాతీయ పరీక్ష మండలిపై సుప్రీం ఆగ్రహం

2 లో..




## జర్నలిస్టుల సమస్యలపై మరో పోరాటం

### ప్రపంచంలోనే టీజేఎఫ్‌ది ఒక చరిత్ర..

- ప్రత్యేక రాష్ట్ర సాధనలో మరపురాని పోరాటం
- టీజేఎఫ్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల విస్తృత స్థాయి సమావేశం
- రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ పిలుపు

ఖమ్మం, ప్రజానావ: సమస్యల సాధన కోసం జర్నలిస్టులు మరో పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ పిలుపు నిచ్చారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల

మిగతా 2 లో

# ఐటీఐలను ఐటీసీలుగా మార్పు

(మొదటిపేజీ తరువాయి)

టాటా సంస్థ సహకారంతో సాంకేతిక నైపుణ్యాల కోసం రూ.2,324 కోట్లతో 65 ఐటీఐలు ఐటీసీలుగా మారుస్తున్నాం. విద్యార్థుల శిక్షణ కోసం ముందుకు వచ్చిన టాటా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఐటీ రంగంలో ప్రపంచంలో తెలుగు వారు పోటీ పడుతున్నారు. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడమే మా బాధ్యతని అన్నారు. రాష్ట్రంలో గల 65 ఐటీఐలను అధునాతనంగా తీర్చిదిద్దుతాం. నైపుణ్యాలను నేర్పించి నిరుద్యోగులకు భరోసా కల్పిస్తాం. విద్యార్థిని విద్యార్థులు ఐటీఐల్లో చేరాలి. ఈ శాఖ తన వద్ద ఉంటుంది. నేనే స్వయంగా పర్యవేక్షిస్తా. ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా అని' సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఐటీఐ స్కిల్ డెవలప్‌మెంట్ అప్ గ్రేడేషన్ ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టాటా టెక్నాలజీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకుగానూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమిస్తుంది. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74). ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయని అధికారులు తెలిపారు.

# పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు
# రూ.20వేల కోట్లు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

పనిచేస్తానని చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి వారణాసి ఎంపీగా మోదీ గెలిచిన తర్వాత తన నియోజకవర్గంలో మంగళవారంనాడు తొలిసారి పర్యటించారు. పీఎం%-%కిసాన్ పథకం కింద 17వ విడతగా రూ.20,000 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, వికసత్ భారత్‌కు రైతులు, యువత, మహిళా శక్తి, పేదలు నాలుగు కీలక స్తంభాలని, తాను ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులు, పేదలకు సంబంధించిన అంశంపైనే తొలి నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలను ప్రధాని ప్రశంసిస్తూ, 60 ఏళ్లలో ఒక ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలో రావడం ఇదే మొదటిసారని చెప్పారు. ఎన్నికల్లో 31 కోట్ల మంది మహిళా ఓటర్లు పాల్గొన్నారు, ప్రపంచం లోనే అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్న రికార్డు ఇదని చెప్పారు. ఈ సంఖ్య దాదాపు అమెరికా జనాభాతో సమానమని అన్నారు. భారత ప్రజాజ్వామ్యం పటిష్టత యావత్ ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసిన వారణాసి ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అసాధరణ తీర్పునిచ్చారని కొనియాడారు. ప్రపంచంలోనే భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబడేందుకు వ్యవసాయ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని మోదీ అన్నారు. సదుద్దేశం, పట్టుదల, రైతుల సంక్షేమానికి పాటుపడటం ద్వారా ఇది సుసాధ్యమని చెప్పారు. గ్లోబల్ మార్కెట్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలని, వ్యవసాయ ఎగుమతుల్లో ఎదురులేని స్థాయికి చేరుకోవాలని అన్నారు. ప్యాకేజీ ఫుడ్ గ్లోబల్ మార్కెట్‌లో ఇండియాను తిరుగులేని స్థాయికి తీసుకువెళ్లాలని, ప్రపంచంలో ప్రతి డైనింగ్ టేబుల్ వద్దకు మన భారతీయ ఫుడ్ ప్రొడక్ట్‌ను తీసుకువెళ్లాలన్నదే తన కల అని చెప్పారు.



రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం%-%కిసాన్ సమ్మాన్‌నిధి' 17వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో విడుదల చేశారు. దీంతో దాదాపు 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2వేలు చొప్పున రూ.20 వేల కోట్లు జమ కానున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో విజయం, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారణాసిలో మోదీ పర్యటించడం ఇదే తొలిసారి. నరేంద్ర మోదీ ఈనెల 9వ తేదీన వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు పీఎంవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన.. 'పీఎం కిసాన్' 17వ వాయిదా చెల్లింపు దస్త్రంపైనే తొలి సంతకం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఈ పథకం అమలు చేస్తోంది. దీనికింద అర్హులైన రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తోంది.

# వైద్యశాఖలో ప్రక్షాళన

- ఒకటి , రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు
- ప్రతి 35 కిలోమీటరుకు ఒక ట్రామా సెంటర్
- కొత్తగా 75 ట్రామా కేర్ సెంటర్లు
- ప్రభుత్వ ఆస్పత్రులకు డయాగ్నోస్టిక్ సెంటర్ల అనుసంధానం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైందని, ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు కనిపిస్తాయన్నారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కిట్‌లో మార్పులు.. ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్, కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డయ గ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వ ఆస్పత్రులకు లింక్ చేసేవిధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 3 రకాల టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, ప్రైవేటు ఆస్పత్రుల పర్యవేక్షణ ( క్లినికల్ ఎస్టాబ్లిష్ ) అని ఆయన వ్యాఖ్యానించారు. ఫార్మా మెడికల్ కోసం (డ్రగ్స్ నియంత్రణ ) ఫుడ్ క్వాలిటీ కోసమని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రాంతాల వారీగా సర్వే చేయకుండా అవసరం లేకుండా ఇచ్చారని, మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు కూడా దొరకని పరిస్థితి అని ఆయన అన్నారు. మెడికల్ ప్రొఫెషన్ స్లో గా పెరగాలన్నారు. కేసీఆరే డాక్టర్ అయ్యాడు, కేసీఆరే ఇంజనీర్ అయ్యాడని ఆయన సెటైర్లు వేశారు. కరోనాకు పారాసిటామాల్ అన్నారు.. కాళేశ్వరం ఆయనే డిజైన్ చేశారన్నారు. హైదరాబాద్ లో 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల కోసం 9 వేల కోట్ల రూపాయలు లోన్ రూపంలో తీసేసుకున్నారని, 21 అంతస్తుల నుంచి 14 అంతస్తులకు తగ్గించామన్నారు దామోదర రాజనర్సింహ. వైద్య రంగంలో రెగ్యులేటరీ పవర్స్ అమలు చేద్దామన్నారు దామోదర రాజనర్సింహ. గత ప్రభుత్వ తీరుపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శలు తెలిపారు. సిద్దిపేట ఆస్పత్రిపై దృష్టి పెట్టి.. ఉస్మానియా ఆస్పత్రిని పట్టించుకోలేదని, పదేళ్లు పాలించి కనీసం ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా కట్టలేదన్నారు. సిటికి పక్కనే ఉన్న మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఎందుకు ఇచ్చారో తెలియదన్నారు దామోదర రాజనర్సింహ. ఇంజనీరింగ్ కాలేజీల మాదిరిగా మెడికల్ కాలేజీలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.

# పుతిన్, కిమ్ కీలక భేటీ

- గత 24 ఏళ్లలో ఇదే తొలిసారి భేటీ
- సైనిక సహకారంపై చర్చ ఇరువురి చర్చలు

**ప్యాంగ్యాంగ్, జూన్18 :** ఉత్తర కొరియాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ మేరకు పుతిన్ ఉత్తర కొరియాకు మంగళవారం ప్రత్యేక విమానంలో బయలుదేరారు. అయితే ఈ దేశంలో పుతిన్ పర్యటించడం గత 24 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. పుతిన్ మొదటిసారి ఉత్తర కొరియాకు 2000లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా అప్పటి అధ్యక్షుడు కిమ్ తండ్రి కిమ్ జోంగ్ ఇల్‌తో సమావేశమయ్యారు. అమెరికా ఆంక్షలు, ఉక్రెయిన్‌పై రష్యా దాడులు, ఉత్తర కొరియా ప్యాంగ్యాంగ్ క్షిపణుల పరీక్షల నిర్వహిస్తున్న తరుణంలో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా ఆంక్షలను ఇరు దేశాలు వేర్వేరుగా ఎదుర్కొంటున్నాయి. ఈ తరుణంలో కిమ్ ఆహ్వానం మేరకు పుతిన్ భేటీ కానున్నారు. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య సైనిక సహకారం మరింత విస్తరించుకునేందుకు చర్చలు జరిగే అవకాశం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే.. పరిస్థితి ఎలా ఉంటుందనే విషయంపై మిగతా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు చేస్తున్న తరుణంలో.. రష్యానుంచి ఆర్థిక సహకారంతోపాటు సాంకేతిక పరంగా సహాయం తీసుకొని అవసరమైన ఆయుధాలు, క్షిపణులను ఉత్తరకొరియా ఇచ్చే అవకాశం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా నుంచి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కోవడానికి సైనిక సహకారం వృద్ధి చేసుకునేందుకు ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా విధించిన సవాళ్లను రష్యా, ఉత్తరకొరియా దేశాలు కలిసి కట్టుగా ఎదుర్కొంటాయని పుతిన్ ధీమా వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని, అనేక విషయాల్లో పరస్పర సహకారంతో ముందుకెళ్తున్నాయని పుతిన్ వెల్లడిరచారు. ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు రష్యాకు ఉత్తర కొరియా ఆయుధాలు పరఫరా చేసే అవకాశం ఉందని పాశ్చాత్య దేశాలు భగ్గుమంటున్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం జరుగుతున్నందున బాంబులు, క్షిపణులతో పాటు సైనిక వ్యవస్థలను అందజేసే అవకాశం ఉందని తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఉత్తర కొరియా, రష్యాపై అమెరికా కఠిన ఆర్థికపరమైన ఆంక్షలు విధించింది. అణ్వాయుధాల అభివృద్ధి విషయం, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా పుతిన్ పర్యటనలో ఇరు దేశాధినేతలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉంది. భద్రత, రక్షణపరమైన సహకారంపైనే ఇరు దేశాల మధ్య ఒప్పందం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈ విషయంపై అమెరికా స్పందించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడిరచింది. ఇరు దేశాలధినేతలు సమావేశం కావడంపై ఎలాంటి అభ్యంతరం లేదని, వారి మధ్య బలపడుతున్న బంధం ఆందోళన కలిగిస్తుందని అమెరికా భద్రతా మండలి అధికారి పేర్కొన్నారు.

# సిక్కింలో భారీ వర్షాలతో అతలాకుతలం

- చిక్కుకుపోయిన 15వేల మంది పర్యాటకు లు
- 500 మందిని రక్షించిన రెస్క్యూ టీం

**సిక్కిం, జూన్ 18 :** సిక్కింలో భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉత్తర సిక్కింలో చిక్కుకుపోయిన 500 మందికి పైగా పర్యాటకులను రక్షించారు. భారీ వర్షాల మధ్య బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ వారిని సేఫ్ చేసింది. మంగన్ నుండి లాచుంగ్ మార్గంలో పెద్ద ఎత్తున వరదలు రావడంతో.. 15,000 మంది పర్యాటకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్నారు. మరోవైపు.. భారీ వర్షాలు, వరదల ధాటికి కొండచరియలు విరిగిపడ్డాయి. అంతేకాకుండా.. రోడ్డు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిరది. ఈ క్రమంలో.. ఉత్తర సిక్కింలో పర్యాటకులు చిక్కుకుపోయారు. మరోవైపు.. వాతావరణం అనుకూలించిన తర్వాత పర్యాటకులను తరలించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం.. ఒక ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లో సుమారు 50 మంది పర్యాటకులు గ్యాంగ్‌టక్‌కు తాత్కాలిక మార్గాల ద్వారా తరలించారు. అంతేకాకుండా.. మంగళవారం ఉదయం వర్షం పడటంతో.. కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో.. బెంగాల్-సిక్కిం సరిహద్దులోని రిషిఖోలా వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది.ఇదిలా ఉంటే.. ఉత్తర సిక్కింలో జూన్ 12 నుంచి వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ విపత్తు బారిన పడి ఆరుగురు మృతి చెందారు. మరోవైపు.. భారీగా ఆస్తి నష్టం జరిగింది. దీంతో విద్యుత్, ఆహార సరఫరాలకు అంతరాయం ఏర్పడిరది. ఇంకా.. అనేక ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్‌లు నిలిచిపోయాయి.

# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

### తనిఖీలు చేపట్టిన భద్రతా సిబ్బంది

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని అగంతకుడు ఎయిర్ పోర్ట్ మెయిల్‌కు బాంబు ఉందని లేఖ పంపాడు. అప్రమత్తమైన సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎయిర్ పోర్ట్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'శంషాబాద్ విమానాశ్ర యానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఇంటెలి జెన్స్ అధికారులకు ఓ అగంతకుడు బాంబు పెట్టామంటూ మెయిల్ చేశాడు. అది చూసిన అధికారులు భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసిన సిబ్బంది అది ఆగతాయి పనిగా తేల్చారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టాం' అని తెలిపా రు. ఒక్కసారిగా సిబ్బంది తనిఖీలు చేయడంతో ప్రయాణికులు హడలిపోయారు.

# కించిత్ తప్పు జరిగినా చర్యలు తీసుకోవాలి

- విద్యార్థుల ఆందోళనలపై స్పందించాలి
- తప్పు జరిగితే చర్యలకు వెనకాడరాదు
- జాతీయ పరీక్ష మండలిపై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, జూన్18:** వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ, అవకతవకలు జరిగాయంటూ వస్తోన్న వార్తలతో దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో వీటిని నిర్వహిస్తోన్న జాతీయ పరీక్ష మండలిపై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా మండిపడిరది. ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా.. దాన్ని సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహిస్తున్న సంస్థగా.. న్యాయంగా వ్యవహరించాలి. ఏదైనా తప్పిదం జరిగితే.. తప్పు జరిగిందని అంగీకరించాలి. ఈ చర్యలు తీసుకోనున్నాం అని వివరించాలి. కనీసం అదైనా వీరి పనితీరుపై విశ్వాసం కలిగిస్తుందని ఎన్టీఏకు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశంలోనే అత్యంత కఠినమైన పరీక్షకు సిద్ధమయ్యేందుకు విద్యార్థులు పడే శ్రమను మరిచిపోకూడదని తెలిపింది. వ్యవస్థను మోసం చేసే వ్యక్తి వైద్యుడైతే.. సమాజానికి ఎంత హానికరమో ఆలోచించాలని వ్యాఖ్యానించింది. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. ఎన్టీఏ నుంచి సకాలంలో చర్యలు ఆశిస్తున్నామన్న ధర్మాసనం.. తదుపరి విచారణను జులై 8న చేపడతామని తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. నీట్ యూజీ (2024) పరీక్ష పవిత్రతకు విఘాతం కలిగిందని వ్యాఖ్యానించింది. దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్‌టీఏపైనే ఉందని తెలిపింది. ప్రశ్నపత్రం లీకేజీ, ఇతరత్రా అక్రమాలు జరిగినందున ఈ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లకు సమాధానం ఇవ్వాలని కేంద్రం, ఎన్‌టీఏలను ఆదేశించింది. అయితే, ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేసేందుకు మాత్రం నిరాకరించిన సంగతి తెలిసిందే.

# ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

(మొదటిపేజీ తరువాయి)

కోట్లు పెండింగ్‌లో పెట్టడం జరిగింది. దీని వలన ఉద్యాన శాఖ, రైతులకు మరియు ఆయిల్ పామ్/ డ్రిప్ కంపెనీలకు, సకాలంలో బకాయిలు విడుదల చేయడం వీలుపడలేదు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రిచొరవతో, ముఖ్యమంత్రి రేవంత్ దృష్టిలోకి ఆయిల్ పామ్ రైతుల మరియు కంపెనీల ఇబ్బందులను తీసుకురాగ, పెండిరగ్ లో వున్న రూ.100.76 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని 2-3 రోజులలో ఆయిల్ పామ్ తోటల నిర్వహణ, అంతర పంటల సాగుకు సంబందించిన రాయితీలను, రైతుల ఖాతాలలో జమ చేయుటకు ఉద్యానశాఖ చర్యలు తీసుకోవడం జరుగుతున్నది.ఇదే విధంగా, 2022%-%23 సం. నుండి విడుదల కావలసివున్న సూక్ష్మ సేద్యానికి సంబందించి, రూ.55.36 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం జరిగింది.

ఈ మొత్తాన్ని అయిల్ పామ్, ఇతర పంటలలో డ్రిప్ పరికరాలను రైతు పంట పొలంలో అమర్చిన సూక్ష్మ సేద్య కంపనీలకు పెండిరగ్ లో ఊన్న బకాయిలుగాను విడుదల చేయడం జరిగింది. బకాయిలు విడుదలైనందువలన 2024-25 సంవత్సరానికి గాను నిర్ధేశిరచిన లక్ష్యాన్ని చేరుకొనేవిధంగా రైతులను ఆయిల్ పామ్ చేపట్టుటకు ప్రొత్సహించవలసిందిగా ఉద్యాన అధికారులను మంత్రి ఆదేశించడం జరిగింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో పురోగతి

### సిట్ బృందానికి హార్ట్ డిస్కులు లభ్యం

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసు దర్యాప్తులో సంచలన ఆధారాలు బయటకొస్తున్నాయి. ఇప్పటికే పలు ఆధారాలు సేకరించిన సిట్ బృందానికి మరో కీలక హార్ట్ డిస్కులు లభించాయి. ఎస్ఐబీకి టెక్నాలజీ అందించిన ఇన్నోవేషన్ ల్యాబ్‌లో హార్డ్ డిస్కులు సీజ్ చేశారు. ఇందులో మూడు సర్వర్లు, ఐదు మినీ డివైసస్‌తో పాటు హార్డ్ డిస్కులను సిట్ స్వాధీనం చేసుకుంది. ఇన్నోవేషన్ ల్యాబ్ ఛైర్మన్ రవికుమార్ ఇంటితోపాటు కార్యాలయంలో సిట్ సోదాలు నిర్వహించింది. దీంతోపాటు బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో సైతం సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో ల్యాబ్ ప్రతినిధులు స్టేట్ మెంట్‌లను కూడా సిట్ రికార్డు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా రవికుమార్ ఇంట్లో దాచి పెట్టిన హార్డ్ డిస్కులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రణీత్ రావు.. ఇన్నోవేషన్ ల్యాబ్ సహకారం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా, ఆ సంస్థ ఛైర్మన్ రవికుమార్ ఇంట్లో లభ్యమైన హార్డ్ డిస్కులు కేసు దర్యాప్తును మలుపు తిప్పుతాయా? అనే ఉత్కంఠ అందిరిలోనూ నెలకొంది. కాగా, ప్రతిపక్ష నేతల ఇళ్లతోపాటు మూడు జిల్లాలో ల్యాబ్ మినీ కంట్రోల్ రూమ్ ఏర్పాటులో రవికుమార్ కీలక పాత్ర పోషించినట్లు సిట్ నిర్ధారించుకుంది. అయితే రవికుమార్‌ను విచారిస్తారా? నోటీసులు జారీ చేశారా? అనే విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది.

# కవితతో మాజీ మంత్రులు ములాఖత్

**సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ ఆమెతో భేటీ**



**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ మంగళవారం కలిశారు. గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ సైతం కవితను కలిసిన విషయం తెలిసిందే. అలాగే రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కూడా కవితతో ములాఖత్ అయ్యారు. తాజాగా ఢిల్లీలోని తీహార్ జైలుకు వెళ్లిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్.. కవితతో ములాఖత్ అయ్యారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.


కాగా, ఢిల్లీ మద్యం కేసులో కవితను ఈడీ అరెస్ట్ చేయగా ప్రస్తుతం ఆమె జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు తీహార్ జైలుకు వెళ్లి ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పి వస్తున్నారు.



ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ ఝా మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి రాగా స్టేట్ ఛాంబర్‌లో కలెక్టర్ కలిసి పూలమొక్క అందజేశారు.
– సిరిసిల్ల, ప్రజానావ

# ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపులు

- మెయిల్స్ ద్వారా 40 ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపు
- అన్నీ ఫేక్ కాల్సేనని తేల్చిన బాంబు తనిఖీ బృందాలు



**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా పలు ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులు రావడంతో అప్ర మత్తమైన పోలీసులు విమానాశ్రాయాల దగ్గర పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రతీ వాహనాన్ని పరిశీలిస్తున్నారు. దీంతో వెంటనే ఆ విమానంలో పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఇదే మెయిల్ ఖాతా నుంచి దేశంలోని 40 ఎయిర్‌పోర్టులకు మధ్యాహ్నం 12.40 గంటల ప్రాంతంలో బెదిరింపు మెయిల్స్ వెళ్లినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. చెన్నై నుంచి దుబాయ్ వెళ్లే ఎమిరేట్స్ ఫ్లైట్ ఈ బెదిరింపులతో రెండు గంటలు ఆలస్యమైంది. 9.50కి ఈ విమానం బయల్దేరాల్సి ఉన్నది. మరోవైపు కోయంబత్తూర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు కూడా బెదిరింపు మెయిల్ అందింది. గుజరాత్‌లోని వడోదర ఎయిర్‌పోర్టుకు, బీహార్‌లోని పాట్నా ఎయిర్‌పోర్టుకు, రాజస్థాన్‌లోని జైపూర్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ మెయిల్ ద్వారా సమాచారం రాగానే భద్రతా సిబ్బంది అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. ఇక జైపూర్‌లోని ఒక కాలేజీకి కూడా బెదిరింపు వచ్చింది. అక్కడ కూడా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఇప్పటి వరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువు లభించలేదు. గతంలో కూడా ఇదే తరహాలో బాంబు బెదిరింపులు వచ్చాయి. ఎలాంటి అనుమానాస్పద వస్తువు దొరకలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇటీవల ఢిల్లీ, బెంగళూరు ఎయిర్‌పోర్టులు, కాలేజీలకు బాంబు బెదిరింపులు వచ్చాయి.

తనిఖీల్లో ఎలాంటి అను మానాస్పద వస్తువులు దొరకలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా మరోసారి అదే తరహాలో బాంబు బెదిరింపులు రావడంతో తీవ్ర కలకలం రేపుతోంది.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం నూతన విధానం

- ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు విషయంలో కీలక నిర్ణయాలు
- ఈసారి అనర్హులకు అక్రిడిటేషన్లు అందకుండా చూస్తాం
- అక్రిడిటేషన్ల గడువును మరో మూడు నెలలకు పెంపు
- మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి




**సూర్యాపేట, ప్రజానావ:** జర్నలిస్టుల సంక్షేమం కోసం త్వరలో నూతన విధానం రూపొందిస్తున్నామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర మహాసభలకు వెళుతున్న సందర్భంగా ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం పట్ల తమ సమస్యలు పరిష్కారం అవుతాయని జర్నలిస్టులలో ఒక రకమైన నమ్మకం, విశ్వాసం ఏర్పడ్డాయన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ గా తాను, సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డితో చర్చించి జర్నలిస్టుల సంక్షేమ కోసం విధి, విధానాలు రూపొందిస్తే వెంటనే సంతకం చేసి అమలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో జర్నలిస్టుల్లో ఈ ప్రభుత్వం పట్ల సానుకూల భావనలు ఏర్పడ్డాయని వెల్లడించారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి శాసనసభ వ్యవహారాలు, ఓటు ఆన్ అకౌంట్, తదుపరి లోక్‌సభ ఎన్నికలు వరుసగా రావడంతో పరిపాలనపై దృష్టి కేంద్రీకరించే విషయం కొంత ఆలస్యమైందన్నారు. అయితే రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో చర్చించడం జరిగిందని, త్వరలో జర్నలిస్టుల సమస్యల పరిష్కర చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇల్లు, ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడియేషన్లు విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటానని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో 24 వేల అక్రిడియేషన్లు కలిగి ఉన్నామని వివరించారు. అనర్హులకు అక్రిడిటేషన్లు అందకుండా చూడటంతో పాటు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు తప్పకుండా అక్రిడిటేషన్ అందేలా చేస్తామన్నారు. అనర్హులు అక్రిడిటేషన్ పొందడం వల్ల జర్నలిజం వృత్తి, వ్యక్తిత్వం మసక బారే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెలతో ముగుస్తున్న అక్రిడిటేషన్ల గడువును మరో మూడు నెలలు పెంచి ఈ లోపుగా కొత్త అక్రిడిటేషన్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చూస్తామని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు కొణిజేతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కూటమి ఎప్పుడైనా కూలిపోవచ్చు

- మోడీ 3.0 సర్కార్‌పై రాహుల్ సంచలన వ్యాఖ్యలు
- మిత్రపక్షాల సభ్యులు టచ్‌లో ఉన్నారని కామెంట్స్



**న్యూఢిల్లీ:** ఎన్డీఏ కూటమిపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్డీఏ కూటమి ఎప్పుడైనా కూలిపోవచ్చని జోస్యం చెప్పారు. ఓ జాతీ య ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమిలో చాలా అసంతృప్తి ఉందని తెలిపారు. ఇక ఎన్డీఏ కూటమిలోని కొందరు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఎన్డీఏ బలహీనంగా ఉండటంతో ఏ చిన్న సమస్య అయినా ప్రభుత్వాన్ని కూల్చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ విద్వేషపు ఆలోచనను ప్రజలు తిరస్కరించారన్నారు. ఎన్నిక ల్లో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉంటే ఇండియా కూటమి నిస్సం దేహంగా మెజార్టీ దక్కించుకొని ఉండేదన్నారు. తమ చేతు లు కట్టేసిన పరిస్థితుల్లోనూ తాము పోరాడామన్నారు. మోడీ 3.0 మనుగడ అయితే కష్టమేనని చెప్పారు. ముమ్మందు కష్టాలను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. కచ్చి తంతా మోడీ శిబిరంలో ఫిరాయింపులు జరిగే అవకాశం ఉందని రాహుల్ వ్యాఖ్యానించారు. కూటమిలో చిన్నపాటి అవాంతరాలు ఎదురైనా ప్రభుత్వం పడిపోతుందన్నారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ బలం పుంజుకుందని తెలిపారు. ఇండియా కూటమి 234 సీట్లు గెలుచుకుం దని గుర్తు చేశారు. ఇక కాంగ్రెస్ సొంతంగా 99 స్థానాలు కైవసం చేసుకుందని చెప్పారు. ఇక బీజేపీ మ్యాజిక్ నెంబర్ దాటలేదని.. మిత్రపక్షాలతో మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. గత పదేళ్లుగా అయోధ్య గురించి మాట్లాడిన పార్టీ అయోధ్యలో తుడిచిపెట్టుకు పోయిందని వ్యాఖ్యలు చేశారు.



# సందేహమే లేదు..

- వయనాడ్‌లో గెలుపు ప్రియాంకదే
- కాంగ్రెస్ నేత శశిథరూర్

**వయనాడ్:** వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ ఎక్స్ వేదికగా హింట్ ఇచ్చారు. ఇక సందేహం లేదు.. వయనాడ్‌ను గెలుచుకునేది ప్రియాంకే అంటూ ఆమె ఫొటోను షేర్ చేశారు. కేరళ ప్రజల తరఫున గళమెత్తేందుకు ప్రియాంక పార్లమెంటుకు వెళుతున్నారని... ఇకపై ఇద్దరు గాంధీలు పోరాటానికి సిద్ధమయ్యారని సచిన్ పైలట్ ట్వీట్ చేశారు. ప్రియాంక గాంధీ వయనాడ్‌కు రావడంపై మహిళా ఓటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇక్కడ లేరనే భావనను ఆమె భర్తీ చేస్తారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ, వయనాడ్ లోక్ సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి.. రెండుచోట్ల విజయం సాధించారు. ఆయన ఒక స్థానాన్ని ఖాళీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన వయనాడ్‌ను వదులుకుంటారనే చర్చ సాగింది. ఈ క్రమంలో వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేసేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేస్తోంది.





# కేరళ సీఎంకు హైకోర్టు షాక్!

- కుమార్తెతో సహా నోటీసులు జారీ
- సీఎంఆర్ఎల్ ఎక్సాలాజిక్ ఆర్థిక లావాదేవీలపై విచారణ
- విజిలెన్స్ దర్యాప్తునకు విజిలెన్స్ కోర్టు తిరస్కరణ

**కేరళ:** అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేరళ సీఎం పినరయి విజయన్, ఆయన కుమార్తె టి వీణపై కాంగ్రెస్ శాసనసభ్యుడు మాథ్యూ కుజల్‌నాదన్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారించిన కేరళ హైకోర్టు వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశిం చింది. అలాగే, సీఎం కుమార్తెకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు కూడా నోటీసులు పంపించాలని పేర్కొం టూ కేసును జులై 2కి వాయిదా వేసింది. 2018-19 మధ్య వీణకు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్, కొచ్చికి చెందిన మైనింగ్ సంస్థ కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ (సీఎమ్ఆర్ఎల్) నుండి అక్రమంగా 1.72 కోట్లు పొందిందనే ఆరోపణలు వచ్చాయి. ఎక్సాలాజిక్ సంస్థ, కొచ్చిన్ మినరల్స్‌కు ఎలాంటి సేవలు అందించకుండానే ఈ మొత్తాన్ని అందుకుందని సీఎం పినరయి విజయన్, ఆయన కూతురు లంచం తీసుకున్నారని మాథ్యూ కేసు వేశారు. అలాగే, సీఎం మద్దతుతో సంబంధిత చట్టాలు, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా సీఎంఆర్ఎల్ అక్రమ మైనింగ్ చేస్తుందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఆయన కుమార్తెపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కోరుతూ చేసిన పిటిషన్‌ను విజిలెన్స్ కోర్టు తిరస్కరించడంతో మాథ్యూ కుజల్‌నాదన్ హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా మంగళవారం విచారణలో భాగంగా ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, ముఖ్యమంత్రి విజయన్, వీణకు నోటీసులు పంపాలని ఆదేశించింది. ఇదే విధమైన అవినీతి ఆరోపణలతో ముఖ్యమంత్రి విజయన్‌పై గతంలో కొచ్చి నివాసి పిటిషన్ దాఖలు చేశారు, ఆ తరువాత పిటిషనర్ మరణించారు.

దీంతో హైకోర్టు రెండు పిటిషన్లు ఒకేలా ఉన్నప్పటికీ విడివిడిగా విచారిస్తామని తెలిపింది. కోర్టు విచారణ తరువాత మీడియాతో మాట్లాడిన మాథ్యూ కుజల్‌నాదన్ .. ఇది సాధారణ ప్రక్రియ అని, తదుపరి విచారణ కోసం వేచి చూస్తామని అన్నారు.



# ప్రజ్వల్ రేవణ్ణకు షాక్

- జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు
- మరో 14 రోజులు పొడిగించిన కోర్టు

**బెంగళూరు:** మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జనతాదళ్ సెక్యూలర్ (జేడీఎస్) మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు షాక్ తగిలింది. ఆయన జ్యుడీషియల్ కస్టడీని బెంగళూరు కోర్టు మరో 14 రోజులు పొడిగించింది. ఈ మేరకు 42వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కాగా, రేవణ్ణ ముగ్గురు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన పలు వీడియోలు లోక్ సభ ఎన్నికల టైంలో వైరల్‌గా మారాయి. దీనిపై పలువురు మహిళలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ప్రజ్వల్ జర్మనీకి పారిపోయారు. ఈ క్రమంలోనే మే 31న జర్మనీ నుంచి వచ్చిన రేవణ్ణను కర్ణాటకలోని కెంపెగౌడ విమానాశ్రయంలోనే సిట్ అధికారులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సిట్ విజ్ఞప్తి మేరకు కస్టడీని పొడిగించారు.





## పీఎఫ్ ఖాతాదారులకు మంచి శుభవార్త!

**న్యూఢిల్లీ:** ఉద్యోగుల ఆర్థిక భవిష్యత్తును సురక్షితంగా ఉంచడంతో ఈపీఎఫ్ఓ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈపీఎఫ్ పదవీ విరమణ కోసం పొదుపు ప్రణాళికను అందిస్తుంది. ముఖ్యంగా రిటైర్‌మెంట్ తర్వాత దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను నిర్ధారిస్తుంది. చాలా మంది ఈపీఎఫ్ఓ సభ్యులకు దానిలోని కొన్ని ముఖ్యమైన నియమాల గురించి తెలియదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా లాయల్టీ-కమ్-లైఫ్ బెనిఫిట్ ప్రొవిజన్‌ను చాలా మంది ఖాతాదారులు పట్టించుకోరు. అయితే తాజాగా ఈ నిబంధన కింద ఈపీఎఫ్ ఖాతాదారులు రూ.50,000 వరకు భారీ ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు వివరిస్తున్నారు. అయితే ఈ ప్రయోజనానికి అర్హత పొందడానికి కొన్ని నిబంధనలు పాటించాలి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సీబీడీటీ) ఈపీఎఫ్ చందాదారులకు రివార్డ్ చేయడానికి లాయల్టీ-కమ్-లైఫ్ బెనిఫిట్‌ను అందజేయాలని సిఫార్సు చేసింది. రెండు దశాబ్దాలుగా తమ ఖాతాలకు నిరంతరం సహ కారం అందించడం ద్వారా తిరుగులేని నిబద్ధతను ప్రదర్శించే వారికి మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఇది అర్హత కలిగిన సబ్‌స్క్రైబర్‌లకు రూ.50,000 అదనపు ప్రయోజనాన్ని అందిస్తుంది. అయితే ఈ ప్రయోజనాల అర్హత ఆ వ్యక్తి జీతం పరిధిపై ఆధారపడి ఉంటుంది. రూ. 5,000 వరకు ప్రాథమిక జీతం తీసుకునే వ్యక్తులు రూ. 30,000 ప్రయోజనం పొందుతారు. రూ.5,001 నుంచి రూ.10,000 మధ్య ఆదాయం పొందుతున్న వారు రూ.40,000 పొందవచ్చు. రూ. 10,000 కంటే ఎక్కువ ప్రాథమిక వేతనం ఉన్న వ్యక్తులు ఈ ప్రోగ్రామ్ కింద గరిష్టంగా రూ.50,000 ప్రయోజనం పొందవచ్చు. ఈపీఎఫ్ఓ సబ్‌స్క్రైబర్‌లు ఈ ప్రయోజనాన్ని పొందేందుకు అదే ఈపీఎఫ్ ఖాతాకు నెలనెలా క్రమం తప్పకుండా సహకారం అందించాలి. ఉద్యోగాలు మారినప్పటికీ సహకారాల కొనసాగింపును నిర్ధారించడానికి ఇప్పటికే ఉన్న ఈపీఎఫ్ ఖాతాను ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలే తప్ప కొత్త ఖాతా ప్రారంభించకూడదు. ఇలా చేయడం ద్వారా ఈపీఎఫ్ఓ చందాదారులు తమ పదవీ విరమణ ప్రయోజనాలను పెంచుకోవడానికి, అలాగే సంస్థ అందించే లాయల్టీ-కమ్-లైఫ్ ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుంది.

# రికార్డ్ సృష్టించిన స్టాక్ మార్కెట్!




**ముంబై:** వరుసగా మూడు రోజుల పాటు స్టాక్ మార్కెట్ మూతపడిన సంగతి తెలిసిందే. మంగళవారం అద్భుతంగా ప్రారంభమైంది. సెన్సెక్స్ ఆల్-టైమ్ హై వద్ద మొదలైంది. ఇది 77,235 వద్ద కొత్త చారిత్రక గరిష్ట స్థాయి వద్ద ప్రారంభమైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ మొదటిసారిగా 23,570 వద్ద మొదలైంది. ఇది దాని రికార్డ్ ప్రారంభ స్థాయి.. జీవితకాల గరిష్ట స్థాయి. ఈ విధంగా నిఫ్టీ తొలిసారిగా 23500 స్థాయిని దాటింది. బీఎస్ఈ సెన్సెక్స్ 242.54 పాయింట్లు లేదా 0.32 శాతం పెరుగుదలతో 77,235.31 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 105.20 పాయింట్లు లేదా 0.45 శాతం పెరుగుదలతో 23,570.80 వద్ద ప్రారంభమయ్యాయి. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ నిరంతరం కొత్త రికార్డు స్థాయిలను చేరుకుంటుంది . ప్రస్తుతం రూ. 437.22 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. ఇది దాని రికార్డు గరిష్టం. అమెరికా డాలర్లలో చూస్తే బీఎస్ఈ మార్కెట్ క్యాప్ 5.23 ట్రిలియన్ డాలర్లకు వచ్చింది. ప్రస్తుతం బీఎస్ఈలోని 3419 షేర్లు ట్రేడ్ అవుతుండగా, వాటిలో 2106 షేర్లు లాభపడుతున్నాయి. 1168 షేర్లు క్షీణించగా, 145 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ట్రేడవుతున్నాయి. 194 షేర్లపై అప్పర్ సర్క్యూట్, 67 షేర్లపై లోయర్ సర్క్యూట్ నడుస్తోంది. మంగళవారం మిడ్‌క్యాప్ ఇండెక్స్ కూడా భారతీయ స్టాక్ మార్కెట్‌లో రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ ఫీట్ కొనసాగుతోంది. ఇది మొదటిసారిగా 55,400 కంటే ఎక్కువగా ఉంది. మిడ్‌క్యాప్ షేర్ల బుల్ రన్ కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ అద్భుతమైన పెరుగుదల కొనసాగుతోంది. ఈ రోజు అది 50,194.35 వద్ద ప్రారంభమైంది, ఇది 50,204.75 వరకు అధిక స్థాయిలను చూసింది. బ్యాంక్ నిఫ్టీలోని 12 స్టాక్‌లలో 10 పెరుగుదలను చూస్తున్నాయి. తిరోగమనంలో 2 స్టాక్‌లు మాత్రమే ట్రేడ్ అవుతున్నాయి. సెన్సెక్స్‌లోని 30 స్టాక్‌లలో 25 లాభాలను, 5 క్షీణతను చూస్తున్నాయి. ఎం అండ్ ఎం 2.80 శాతం, విప్రో 2.36 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచాయి. టైటాన్ 2.08 శాతం, పవర్ గ్రిడ్ 1.31 శాతం, ఎస్‌బిఐ 1.19 శాతం చొప్పున పెరిగాయి. పడిపోయిన స్టాక్‌లలో, మారుతి 1.86 శాతం పడిపోయి టాప్ లూజర్‌గా కొనసాగుతుండగా, అల్ట్రాటెక్ సిమెంట్ 0.52 శాతం పడిపోయింది. ఏషియన్ పెయింట్స్ షేర్లు 0.17 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు 0.12 శాతం పడిపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా నేడు పడిపోయిన స్టాక్‌లలో ఉంది.




## భారత్‌కు గూగుల్ జెమిని యాప్

**ముంబై:** కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో గూగుల్ దూసుకెళ్తోంది. గతేడాది చివర్లో జెమిని (జెమిని ఏఐ) పేరుతో అత్యంత అడ్వాన్స్‌డ్ వెర్షన్ ఏఐ టూల్‌ను పరిచయం చేసింది. క్రమేణా పలు ఫీచర్లను జోడిస్తూ వచ్చింది. తాజాగా ఈ ఏఐ అసిస్టెంట్ జెమిని మొబైల్ యాప్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. ఈ అప్లికేషన్ ప్రస్తుతం దేశంలోని యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. 9 భాషలకు సపోర్ట్ చేసేలా దీన్ని రూపొందించింది. "జెమినిలో స్థానిక భాషలను జోడించాం. గూగుల్ మెసేజెస్‌లో కూడా జెమినీని వినియోగించుకోవచ్చు. రానున్న రోజుల్లో సరికొత్త ఫీచర్లను జోడించనున్నాం" అని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. తెలుగుతో పాటు హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, తమిళం, ఉర్దూ భాషల్లోనూ ఈ యాప్ సేవలందిస్తుందని గూగుల్ పేర్కొంది. అంటే మీకు నచ్చిన భాషలో జెమినీని యాక్సెస్ చేయొచ్చన్నమాట.

## ధనలక్ష్మి బ్యాంక్ ఎండీగా కేకే అజిత్ కుమార్!



**న్యూఢిల్లీ:** ప్రైవేట్ బ్యాంక్ ధనలక్ష్మి బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా కేకే అజిత్ కుమార్ నియమితులయ్యారు. ఈ నెల 20న ఎండీగా అజిత్ కుమార్ బాధ్యతలు స్వీకరిస్తారని కేరళ కేంద్రంగా పని చేస్తున్న ధనలక్ష్మి బ్యాంకు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది. బ్యాంక్ ఎండీ కం సీఈఓగా అజిత్ కుమార్ నియామకానికి బ్యాంకు బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. జూన్ 20 నుంచి మూడేండ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. కంపెనీల చట్టం-2013, సెబీ నిబంధనలకు అనుగుణంగా అజిత్ కుమార్ నియామకానికి వాటాదారుల ఆమోదం లభించాల్సి ఉందని ధనలక్ష్మి బ్యాంకు పేర్కొంది. అజిత్ కుమార్‌కు బ్యాంకింగ్ రంగంలో 36 ఏండ్ల అనుభవం ఉంది. ఫెడరల్ బ్యాంకులో క్రెడిట్, హ్యూమన్ రీసోర్సెస్, బిజినెస్, బ్రాంచ్ బ్యాంకింగ్ రంగాల్లో సేవలందించారు. ప్రస్తుతం ఫెడరల్ బ్యాంక్ అధ్యక్షుడి హోదాలో చీఫ్ హ్యూమన్ రీసోర్సెస్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

## మహానంది క్షేత్రంలో మరోసారి చిరుత కలకలం



**మహానంది:** మహానంది క్షేత్రంలో మరోసారి చిరుత హల్‌చల్ చేసింది. క్షేత్రంలోని అన్నదాన సత్రం వద్దకు వచ్చి కుక్కను లాక్కొని వెళ్లింది. ఈ క్రమంలో చిరుతను చూసి ఆలయ సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలని అధికారు లు మైకుల్లో ప్రకటిస్తూ.. పెంపుడు జంతువుల ను స్వేచ్ఛగా వదిలేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఆలయ పక్కన ఉన్న విద్యుత్ కార్యాల యం వద్ద చిరుత సంచరించినట్లు ఆనవాళ్లు బయటపడ్డాయి. ఇదిలా ఉంటే ఆదివారం సైతం చిరుత అడవిలో నుంచి క్షేత్ర పరిసరా ల్లోకి ప్రవేశించి విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకున్నట్లు తెలుస్తోంది. కుక్కలు మొరగడంతో విద్యుత్ సిబ్బంది అలర్ట్ అయ్యారు. స్థానికులు, విద్యుత్ సిబ్బంది కేకలు, విజిల్స్ వేయడంతో చిరుత అడవిలోకి పారిపోయింది. భక్తులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిం దని అధికారులు తెలిపారు.

# పవన్ కల్యాణ్‌కు 'వై' ప్లస్ సెక్యూరిటీ

- పవన్ కల్యాణ్‌కు ప్రభుత్వం భద్రత పెంపు
- 'వై' ప్లస్ సెక్యూరిటీతో పాటు బుల్లెట్ ప్రూఫ్ కారు



**అమరావతి, ప్రజానావ:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రభుత్వం భద్రత పెంచింది. ఆయనకు 'వై' ప్లస్ సెక్యూరిటీతో పాటు ఎస్కార్ట్, బుల్లెట్ ప్రూఫ్ కారును కేటాయించింది. కాగా, ఇవాళ సచివాలయం వెళ్లనున్న పవన్ తన ఛాంబర్‌ను పరిశీలించనున్నారు. రేపు ఆయన డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. మరోవైపు చంద్రబాబు మంత్రివర్గంలో పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవితో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సోమవారం ఛాంబర్ కేటాయించారు. రెండో బ్లాక్‌లోని మొదటి అంతస్తులో 212 గదిని ఆయన కోసం సిద్ధం చేస్తున్నారు. జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌కు సైతం అదే అంతస్తులో ఛాంబర్లు కేటాయించడం విశేషం.

## ఈవీఎంలపై మాజీ సీఎం జగన్ సంచలన ట్వీట్

- పేపర్ బ్యాలెట్లు వాడాలని ట్వీట్
- ప్రజాస్వామ్యం నిస్సందేహంగా ఉండాలని హితవు



**విజయవాడ, ప్రజానావ:** ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాత ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంలపై విమర్శలు వస్తున్న వేళ ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు. ఈవీఎంలపై నమ్మకం సన్నగిల్లుతున్న వేళ పేపర్ బ్యాలెట్లు వాడాలంటూ ట్వీట్ చేశారు. "న్యాయం జరగడమే కాదు.. అది ప్రజలకు కనిపించాలి. అదేవిధంగా ప్రజాస్వామ్యం బలంగా ఉండటమే కాదు.. నిస్సందేహంగా కనిపించాలి. ప్రపంచంలో ఎక్కడైనా ప్రజాస్వామ్య దేశంలో నిర్వహించే ఎన్నికల పద్ధతుల్లో ఈవీఎంలు కాకుండా పేపర్ బ్యాలెట్లు వాడుతున్నారు. మన ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టుకోవడంలో మనమూ అదే దిశగా పయనించాలి." అని జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. జూన్ 4న ఫలితాల రోజే సీఎం జగన్ ఈవీఎంలపై పరోక్షంగా ఈవీఎంల పై అనుమా నాలు వ్యక్తం చేశారు. తాము ప్రజ లకు ఎంతో మేలు చేసినా ఓట్లు ఏమయ్యాయో అర్థం కాలేదన్నారు. దీనిపై ఎన్నో అనుమానాలు ఉన్నప్పటికీ వాటికి ఆధారాలు లేవని చెప్పారు. ఇప్పుడు నేరుగా జగన్ మోహన్ రెడ్డే ఈవీఎం లపై విమ ర్శలు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా నెటిజన్లు స్పందిస్తూ 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఈవీఎంలపై అనుమానం వ్యక్తం చేసినప్పు డు మాట్లాడిన జగన్ స్పీచ్‌ను వైరల్ చేస్తున్నారు.




# ఈనెల 21 నుంచే ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- మూడు రోజుల ముందుగానే
- సభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక

**అమరావతి, ప్రజానావ:** ఆంధ్రప్రదేశ్ శాసన సభా సమావేశాలు ఈ నెల 21, 22 తేదీల్లో జరుగనున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ నెల 24 నుంచి జరుగుతా యని ప్రకటించినప్పటికీని సమావేశాల తేదీని ముందుకు జరిపారు. సమావేశాల మొదటి రోజు కొత్తగా ఎన్నికైన 175 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం , మరుసటి రోజు శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగనుం దని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ పార్టీ రెండోసారి పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన అనంతరం 2014లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పోటీ చేసి మొదటి సారి అధికారంలోరాగా 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఒంటిరిగా పోటీచేసి ఓడిపోయింది. వైఎస్ జగన్ నేతృత్వంలో వైసీపీ ప్రభుత్వం 175కు 151 స్థానాలు కైవసం చేసుకుని రాష్ట్ర అసెంబ్లీలో అడుగుపెట్టింది. టీడీపీ 23 స్థానాలతో, జనసేన ఒక స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి రెండో సారి పోటీ చేసి అనూహ్య ఫలితాలను సాధించింది. 164 స్థానాల్లో కూటమి గెలుపొందగా వైసీపీ 11 స్థానాలకు మాత్రమే పరిమితమై ప్రతిపక్ష హోదాను కోల్పోయింది.

# దేవరలో ఆసక్తికర యాక్షన్ సీన్స్

'దేవర'గా థియేటర్లలో యాక్షన్ హంగామా చూపించనున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని కొరటాల శివ తెరకెక్కిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను ఛాయాగ్రాహకుడు రత్నవేలు సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. ఎన్టీఆర్, సైఫ్‌లపై గోవా అడవుల్లో ఓ ఆసక్తికర యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. దీనికి స్టంట్ మాస్టర్ పీటర్ హెయిన్స్ నేతృత్వం వహించారు. భారీ వర్షాలతో ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ తారక్, సైఫ్‌లతో పాటు మిగిలిన చిత్ర బృందం సహకారంతో ÷ట్‌ను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తదుపరి షెడ్యూల్ థాయ్‌లాండ్‌లోని కాబ్రీ దీవుల్లో ప్రారంభించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అక్కడ ఎన్టీఆర్, జాన్వీలపై ఓ రొమాంటిక్ గీతాన్ని చిత్రీకరించనున్నారు. దీనికోసం వాళ్లిద్దరూ ఇప్పటికే అక్కడికి పయనమయ్యారు. మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోన్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం 'దేవర: పార్ట్ 1' పేరుతో సెప్టెంబరు 27న విడుదల కానుంది. దీనికి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు.




# ఫేక్ అకౌంట్లతో జాగ్రత్త

## హెచ్చరించిన జాన్వీ కపూర్

బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫొటోలు, సినిమాల విశేషాలు పంచుకుంటారు. తాజాగా ఆమె పేరుతో ఉన్న ఓ ఎక్స్ అకౌంట్‌లో అసభ్యకరమైన పోస్ట్‌లు దర్శనమిచ్చాయి. దీంతో ఈ ఖాతాలపై టీమ్ క్లారిటీ ఇచ్చింది. 'డిజిటల్ ప్రపంచంలో ఎవరి పేరుతోనైనా అకౌంట్ క్రియేట్ చేయడం సులభంగా మారింది. జాన్వీకపూర్‌కు అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతా లేదని మరోసారి స్పష్టం చేస్తున్నాం. దయచేసి ఈ ఫేక్ అకౌంట్‌లను ప్రోత్సహించకండి. వాటిని ఫాలో కావొద్దు. వీటిలో పోస్ట్ చేసే సమాచారాన్ని నమ్మొద్దు. మీ అందరి సహకారానికి ధన్యవాదాలు' అని అప్రమత్తంగా ఉండాలని టీమ్ కోరింది. ఆమె పేరుతో ఎక్స్‌లో ఉన్న నకిలీ ఖాతాల వివరాలను పేర్కొంది. జాన్వీ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉండడం కోసం కేవలం ఇన్‌స్టానే వాడతారని టీమ్ పేర్కొంది. ప్రస్తుతం ఈ బ్యూటీకి ఇన్‌స్టాలో 24 మిలియన్ల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఇటీవల 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో జాన్వీ మాట్లాడుతూ.. సోషల్ మీడియా అంటే తనకు భయమని తెలిపారు. ప్రముఖ సోషల్ మీడియా వెబ్‌సైట్ రెడిట్ ను తనకంటే తన చెల్లి ఖుషీనే ఎక్కువగా వాడుతుందని చెప్పారు. ఇందులో విశేషాలు చెల్లిని అడిగి తెలుసుకుంటానని ఆమె వెల్లడించారు. ఇటీవలే ఈ చిత్రంతో విజయాన్ని అందుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం తెలుగులో రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ సరసన నటిస్తున్నారు.




# కుటుంబకథా చిత్రాలే ఇష్టం: కియారా




కుటుంబంతో కలిసి చూసే సినిమాల్లో నటించడమే నా లక్ష్యం అని అంటోంది బాలీవుడ్ భామ కియారా అద్వాణీ. 'ఫగ్లీ'తో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన ఈ అందాల తార.. తన నటనతో తెలుగు ప్రేక్షకులనూ మెప్పించింది. త్వరలో 'గేమ్‌ఛేంజర్'తో రావడానికి సిద్ధమవుతున్న కియార.. హిందీ పరిశ్రమలో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. 'నటిగా ఎదగాలనే లక్ష్యంతో నాకు 21ఏళ్లు ఉన్నప్పుడు సినీ కెరీర్‌ను ప్రారంభించాను. అప్పుడు నేనేం చేస్తున్నానో.. ప్రేక్షకులకు ఎలా దగ్గరవ్వాలో కూడా తెలియదు. ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలో అవగాహన లేదు. కానీ నా పదేళ్ల ప్రయాణంలో జీవితంలో ఎలా పైకి ఎదగాలో నేర్చుకున్నాను. పాత్రలు, కథల ఎంపికలో మార్పులు చేస్తూ.. కుటుంబంతో కలిసి చూసేలా సినిమాలు తీయాలని నిర్ణయించు కున్నాను. ఇప్పుడిదే నా లక్ష్యం. ఈ ప్రయాణంలో ఎన్నో మరువలేని జ్ఞాపకాలను పోగుచేసుకున్నాను. ఇప్పటికీ రోజూ కొత్తగానే అనిపిస్తుంటుంది. ప్రేమ, కలలు, చిరునవ్వులు, కన్నీళ్లు.. ఇలా ఎన్నో అనుభవాలను ఎదుర్కొన్నాను. నా లక్ష్యాన్ని సాధించడానికి సహకరించిన దర్శకులకు, సహనటులకు, అభిమానులకు కృతజ్ఞతలు' అని చెప్పుకొచ్చింది కియార.

# మిస్టర్ బచ్చన్‌గా అలరించనున్న రవితేజ

'మిస్టర్ బచ్చన్'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు రవితేజ. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాని హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం నుంచి షో రీల్ పేరుతో ఓ వీడియో గ్లింప్స్ విడుదల చేశారు. దాదాపు నిమిషం నిడివి ఉన్న ఈ ప్రచార చిత్రంలో ఒక్క డైలాగ్ లేకున్నా.. రవితేజ ఆద్యంతం మాస్ యాక్షన్ హంగామాతో అలరించారు. ఆయన ఇందులో నిజాయతీ గల ఆదాయపన్ను అధికారిగా కనిపించనున్నట్లు అర్థమవుతోంది. తను ఓ రాజకీయ నాయకుడి ఇంటికి రైడ్‌కు వెళ్లాక ఏం జరిగిందనే ఆసక్తికర అంశంతో ఈ సినిమా రూపొందించినట్లు తెలుస్తోంది. ఆఖర్లో అమితాబ్ కటౌట్ ముందు ఆయన్ని అనుకరిస్తూ రవితేజ కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. త్వరలోనే విడుదల తేదీ ప్రకటించనున్నారు. ఈ సినిమాకి సంగీతం: మిక్కీ జె.మేయర్, ఛాయాగ్రహణం: అయనంక బోస్.



# పారితోషికంలో తగ్గేదే లేదంటున్న ఫాజిల్




మలయాళం సూపర్ స్టార్ ఫహాద్ ఫాజిల్ 'పుష్ప 2' లో ఒక కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ముందు 'పుష్ప' లో ఫహాద్ ఫాజిల్ కనిపించారు, ఇప్పుడు ఈ సీక్వెల్ లో అతని పాత్ర నిడివి ఇంకా ఎక్కువ ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఆగస్టు 15 న విడుదల కావాల్సి వుంది, కానీ ఇప్పుడు డిసెంబర్ 6 కి వాయిదా పడింది. అయితే ఇంత దూరం వాయిదా పడటంతో అయితే ఇంత దూరం వాయిదా పడటంతో అల్లు అర్జున్ అభిమానులు కొంచెం అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇక ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్ విషయానికి వస్తే అతను మలయాళంలో చేసిన సినిమా 'ఆవేశం' చాలా పెద్ద విజ్జయం సాధించటమే కాకుండా, వంద కోట్ల క్లబ్బులోకి చేరింది కూడా. మలయాళం పరిశ్రమలో ఫహాద్ ఫాజిల్ ఇప్పుడు పెద్ద సూపర్ స్టార్ అయిపోయారు. మరి అటువంటి సూపర్ స్టార్ తెలుగు సినిమా 'పుష్ప 2' కి తీసుకుంటున్న పారితోషికం ఎంతో తెలిస్తే షాకవుతారు. ఫహాద్ ఫాజిల్ ఈ సినిమా కోసం రోజువారీ పారితోషికం తీసుకుంటారని తెలుస్తోంది. అతను రోజుకి రూ.12.50 లక్షలు పారితోషికం తీసుకుంటారని సమాచారం. ఈ షెడ్యూల్‌లో సుమారు నెల రోజులపాటు తన తేదీలను ఈ సినిమా కోసం కేటాయించారు ఫహాద్ ఫాజిల్. ఇంతకు ముందు కూడా చాలా రోజులు ఈ సినిమా కోసం కేటాయించారు. గత రెండు సంవత్సరాల నుండి ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది, కానీ ఇంకా పూర్తి కాలేదు. అయితే ఇక్కడే ఇంకొక ట్విస్టు కూడా వుంది. ఫహాద్ ఫాజిల్ ఈ సినిమాకి కేటాయించిన తేదీలలో ఒకవేళ చిత్రీకరణ ఎటువంటి పరిస్థితుల్లో అతనితో చెయ్యకపోయినా, చిత్రీకరణ ఆగిపోయినా ఫహాద్ ఫాజిల్ కి పారితోషికం ముట్ట చెప్పాల్సిందే. అదే తెలుగు క్యారెక్టర్ నటులైతే, ఒకవేళ చిత్రీకరణ కాన్సుల్ అయితే ఆరోజు పారితోషికం ఇవ్వరు, కానీ ఫహాద్ ఫాజిల్ కి అలా కాదు, అతనికి ఇవ్వాల్సిందే. అదీ అతని డిమాండ్. చాలాసార్లు అతను ఇచ్చిన తేదీల్లో చిత్రీకరణ జరగని సంఘటనలు కూడా వున్నాయి, అయినా కూడా అతనికి పారితోషికం చెల్లించారు. తెలుగు ఫిల్మ్ మేకర్స్ కి తెలుగు క్యారెక్టర్ నటులంటే అంత చిన్నచూపు, పరభాషా నటులంటే వారు పెట్టిన షరతులు అన్నిటికీ తలవొగ్గి మరీ తీసుకుంటారు.

# అసలు రైతులను గుర్తించే పనిలో ప్రభుత్వం

### పెత్తందార్లు, అధికారుల భూములకు నో రుణమాఫీ

### రుణమాఫీకి ముందే లెక్కతేల్చనున్న సర్వే



**ఖైరతాబాద్, ప్రజానావ:** రైతుభరోసా మాదిరేరుతు రుణమాఫీకి కూడా విధివిధానాలు రాబోతున్నాయి. ఇందుకు పేదరికమే గీటురాయి కానుంది. అసలుసిసలు రైతులను గుర్తించబోతున్నారు. మోతుబరి రైతుల రుణాలను లెక్కలోకి తీసుకోవద్దన్న సూచనలు వచ్చాయి. దీంతో కేవతం వ్యవసాయం కోసం రుణాలు తీసుకున్న బక్కరైతులకే లబ్ది చేరూర్చేలా రుణమాఫీని చేయబోతునట్లు సమాచారం. 'పీఎం కిసాన్' పథకంలో ఉన్న నిబంధనలనూ రుణమాఫీలో అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై దాదాపు తుది నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.దీని ప్రకారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆదాయ పన్ను కడుతున్న వారికి రుణమాఫీ అందేందుకు అవకాశం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, మిగతా చిన్న ఉద్యోగస్తులు కూడా వివిధ అవసరాల నిమిత్తం ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నారన్న అంశం తెరమీదకు వచ్చింది. రిటర్నులు దాఖలు చేశారన్న కారణంతో ఆ రైతులను మాఫీ నుంచి మినహాయించే అవకాశాలు లేవని, ఆదాయ పన్ను కడుతున్న వారినే మినహాయించే ఆలోచన ఉందని తెలుస్తోంది. ఆ మేరకు ఐటీ రిటర్నులు దాఖలుచేస్తున్న చిన్న రైతులకు, చిన్న ఉద్యోగస్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఏం చేయాలనే దానిపై 4రోజుల్లో మంత్రివర్గ సమావేశం నిర్వహించి రుణమాఫీ అమలుకు తీసుకోవాల్సిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయనుంది. రైతులకు రుణమాఫీని తొలి ఏకాదశి, అంటే జూలై 17న మొదలుపెట్టనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రుణమాఫీ పక్రియను జూలైలోనే ప్రారంభిస్తే అప్పటికే వ్యవసాయ పనులు ముమ్మరమై పెట్టుబడి అవసరమైన రైతులకు మళ్లీ రుణం తీసుకునేందుకు అవకాశం కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జూలైలో ప్రారంభించి ఆగస్టు వరకు మొత్తం 3 విడతల్లో ఈ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధుల సమీకరణ కొలిక్కివస్తుండటంతో.. అన్నదాతలకు హామీనిచ్చిన ఆగస్టు 15 వరకు కాకుండా.. ఒక నెల ముందుగానే పక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు పీఎం కిసాన్‌లో అమలు చేస్తున్న నిబంధనలను రుణమాఫీకి కూడా వర్తింపజేసినా ఈ పథకం కోసం రూ.25వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. రుణమాఫీకి అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు భూమి పాస్‌బుక్, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాటు బ్యాంకుల ఖాతాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

అదే విధంగా ఈ పక్రియ మొత్తం పూర్తయ్యేవరకు రైతులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించేం దుకు వీలుగా ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకం గా గ్రీవెన్స్ సెల్‌ను కూడా ఏర్పాటు చేయను న్నారు. ఈ క్రమంలో అసలు రైతులను కూడా గుర్తించి రికార్డులు నమోదు చేయనున్నారు. రుణాలను తీసుకుని ఏయే పంటలు వేశార న్నది కూడా లెక్కలోకి రానుంది.



# గుత్తాపై గుర్రుగా.. గులాబీ బాస్

- మండలి ఛైర్మన్‌గా గుత్తాను తొలగించే ఎత్తులు
- పండలిలో పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పై ఎత్తులు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ఎన్నికల హడావిడి ముగియడంతో ఇక రాజకీయ ఎత్తులు,పైఎత్తులకు తెలరలేవనుంది. ఎవరు ఎటువైపు ఉంటారన్నది తేలనుంది. మొత్తంగా బిఆర్‌ఎస్ రాజకీయంగా భారీ మూల్యాన్ని చెల్లించుకుంటుం దనడంలో సందేహం లేదు. మరో ఐదేళ్ల వరకు బిఆర్‌ఎస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అప్పటి వరకు కేసులు, అవినీతి వ్యవహారాలతో బిఆర్‌ఎస్ మరింతగా మూల్యం చెల్లలించుకో తప్పదు. ఈ క్రమంలో బిజెపి, అధికార కాంగ్రెస్‌ల మధ్యనే రాజకీయం నడవనుంది. అలాగే శాసన మండలిలో తమ బలాన్ని పెంచుకునేందుకు కాం గ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు సన్నద్ధమవుతోందన్న ప్రచారం వినిపిస్తోంది. ఈ క్రమంలో మండలి ఛైర్మన్ గుత్తాపై బీఆర్‌ఎస్ పెట్టడం ద్వారా పట్టు సాధించాలని బిఆర్‌ఎస్ ప్రతివ్యూహాలు పన్నుతోంది. అవిశ్వాస తీర్మానం, దీన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అనుసరించనున్న వ్యూహాలు.. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ మధ్య పట్టు కోసం తెలంగాణ శాసన మండలి వేదికకానుందనడంలో సందేహం లేదు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిపై అవిశ్వాస తీ ర్మానం పెట్టేందుకు బీఆర్‌ఎస్ అధిష్టానం రెడీ అవుతోందని తెలుస్తోంది. ఇకపోతే మండలి ఛైర్మన్ గుత్తా సహా మెజార్టీ ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కూడా ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగలడంతో మండలిలో పట్టుకు కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్న శాసన మండలి ఛైర్మన్ గుత్తాకు వ్యతిరేకంగా అవిశ్వాసం నెగ్గితే రాజకీయంగా పైచేయి చాటుకోవచ్చని బీఆర్‌ఎస్ అధిష్టానం వ్యూహాలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలోరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవిశ్వాస తీర్మానాలతో స్థానిక సంస్థలను అన్నింటిని కైవసం చేసుకుం టోంది. అసెంబ్లీ ఎన్నికలు విజయ దుందిభీ మోగించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా గట్టి పట్టునే సాధించింది. మరోవైపు బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాకుండా కాంగ్రెస్ ఖంగు తినిపించింది. శాసనసభలో బలం లేకపోయినా.. పెద్దల సభ శాసనమండలిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని బిఆర్‌ఎస్ భావిస్తోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్, బిజెపిల వైపు గోడ దూకేందుకు సిద్ధమవుతు న్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండడం, పార్లమెంట్ ఎన్నికల టైంలో సుఖేందర్ రెడ్డి కొడుకు అమిత్‌రెడ్డి కాంగ్రెస్ చేరడాన్ని బీఆర్‌ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలవేళ బీఆర్‌ఎస్‌లోని గుత్తా అనుచరులు మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్ చేరారు. తొలుత అమిత్ రెడ్డి నల్గొండ, భువనగిరి నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ ఎంపీ టికెట్ ఆశించగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ మాజీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ పెద్దలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుఖేందర్ రెడ్డి.. కేసీఆర్, బీఆర్‌ఎస్‌పై ఫైర్ అయ్యారు. కేసిఆర్ చెప్పుడు మాటలు వినడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని ఎంపీ ఎన్నికల సమయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో సుఖేందర్ రెడ్డిని చైర్మన్ పదవి నుంచి దింపాలని బీఆర్‌ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో నెగ్గడం ద్వారా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేయవచ్చునే చర్చ బీఆర్‌ఎస్ వర్గాల్లో జరుగుతోంది. గుత్తాపై అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే ఓ రకంగా రేవంత్ రెడ్డి దూకుడుకు చెక్ పెట్టినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణ శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా, ప్రస్తుతం రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు మినహాయిస్తే ప్రస్తుతం మండలిలో 38 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. మండలి చైర్మన్ పదవి నుంచి దింపడానికి మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉండాలి. ప్రస్తుతం 27 మంది సభ్యులు అవిశ్వాసానానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్ పక్షాన 31 మంది ఎమ్మెల్సీలు ఉన్నట్టు మండలి రికార్డులు చెప్తున్నాయి. కానీ దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచారు. చైర్మన్ సుఖేందర్ రెడ్డితో కలిపితే కాంగ్రెస్ సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిని మినహాయిస్తే బీఆర్‌ఎస్ తరఫున 26 మంది ఉంటారు. ఎంఐఎంకు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా, బీజేపీకి ఒకరు ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఓటింగ్ కు దూరంగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనసభలో తిరుగులేని బలం ఉన్నా.. మండలిలో మాత్రం బీఆర్‌ఎస్ పార్టీదే పైచేయిగా ఉంది. పలు కీలక బిల్లుల ఆమోదం, ఇతర అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అడ్డంకిగా మారే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శాసనమండలిలో 'ఆపరేషన్ ఆకర్ష కు సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్రం ఏర్పడినపుడు శాసనసభలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేని బలం ఉన్నా.. శాసన మండలిలో మాత్రం కాంగ్రెస్‌దే ఆధిపత్యం ఉండేది. అప్పట్లో.. అధికార బీఆర్‌ఎస్ మండలిలోని మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకుంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారన్న వార్తలు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. మండలి చైర్మన్ పై బీఆర్‌ఎస్ అవిశ్వాస తీర్మానం పెడితే ఆ పార్టీకి ఉన్న సంఖ్యా బలంతో తేలికగా నెగ్గుతుంది. సభలో బీఆర్‌ఎస్ ఆధిపత్యాన్ని గండి కొట్టేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష వైపు మొగ్గు చూపుతోంది. బీఆర్‌ఎస్ నుంచి 14 మంది ఎమ్మెల్సీలను చేర్చుకుంటే మండలిలో కాంగ్రెస్ సంఖ్యాబలం 20కి చేరుకుంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో బిఆర్‌ఎస్‌కు చెక్ పెట్టవచ్చని అనుకుంటున్నారు.

# నేడు వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

### తాడేపల్లి వేదికగా పార్టీ ఓటమిపై పోస్ట్‌మార్టమ్

### అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనా చర్చ




**అమరావతి, ప్రజానావ :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన వైసీపీ.. తాజా పరిస్థితిపై పోస్టుమార్టం మొదలుపెట్టింది. తమదే అధికారమని, విశాఖలోనే ప్రమాణం అటంఉ జగన్ కుండబద్దలు కొట్టి చెప్పారు. లక్షల కోట్లు అప్పులు చేసి, ప్రజల ఖాతాల్లో వేసినా ప్రజలు నమ్మలేదు. ఈ క్రమంలో వరుస సమావేశాలతో తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో జగన్ బిజిబిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, భవిష్యత్ కార్యాచరణకు సిద్దం అవుతున్నారు. ఈ నెల 19న బుధవారం వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనుంది. పార్టీ అధినేత వైఎస్ జగన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి కూడా క్యాంప్ ఆఫీస్ వేదిక కానుంది. ఈ కీలక సమావేశానికి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలతో పాటు, ఎన్నికల్లో పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు అందర్నీ హైకమాండ్ ఆహ్వానించింది. వీరితో పాటు ఎంపీలు మినహా పార్లమెంట్‌కు పోటీచేసిన అభ్యర్థులను కూడా ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సమావేశంలో వైఎస్ జగన్ పరాజయానికి కారణాలను సమీ క్షించనున్నారు. ఎవరెవరు ఎటు అడుగులు వేస్తారనే విషయంపై పూర్తి స్పష్టత కూడా రానుంది. అయితే ఎవరున్నా, లేకున్నా.. జీరోతోనే వైసీపీ మొదలైందన్న విషయాన్ని వైసీపీ నేతలు కొందరు గుర్తు చేస్తూ, సోషల్ మీడియాలో చెప్పుకుంటున్న పరిస్థితి. అసలే ప్రతిపక్ష హోదా లేదు.. ఇక ఉన్న ఎమ్మెల్యేల్లో ఎవరైనా జంప్ అయితే ఏంటి పరిస్థితి..? అనేదానిపై ఒకింత గందరగోళంగానే ఉందని తెలుస్తోంది. ఎంత మంది జగన్‌తో ఉన్నారనే దానిపై సమావేశాల తరవాత పూర్తి స్పష్టత వచ్చేయనుందన్న మాట. వాస్తవానికి ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు టీడీపీతో, ఒకరిద్దరు ఎంపీలు బీజేపీలోకి టచ్‌లోకి వెళ్లినట్లుగా వార్త లు గుప్పుమంటున్నాయి. రెండు మూడ్రోజు లుగా మీడియాలో, సోషల్ మీడియాలో జంపింగ్‌లపై హడావుడి జరుగుతున్నప్పటికీ ఎక్కడా స్పందించిన దాఖలాల్లేవ్.. కనీసం ఖండించిన పరిస్థితులు కూడా లేవు. మరి మౌనానికి అర్థం అంగీకారమేనా లేదా అన్నది.. బుధవారంతో తేలిపోనుంది. ఇదంతా ఒక ఎత్తయితే తన హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణలకు రంగం సిద్దం చేస్తోంది. తాడేపల్లి ప్యాలెస్ కు ఫర్నీచర్ కొనుగోళ్లు మొదలు, రుషికొండలో భవనాల నిర్మాణం వరకు అన్నింటిపైనా విచా రణ సాగేలా ఉంది. వీటిపై జగన్ సమాధానం సిద్ధం చేసుకోబోతున్నారు. మరోవైపు 24 నుంచి అసెంబ్లీ సమావేశాల్లో అనుసరిం చాల్సిన వ్యూహం పైనా చర్చించే అవకాశం ఉంది.



## యాదాద్రిలో తిరిగి గిరిప్రదక్షిణ

### ఆలోచన చేస్తున్న ఆలయ అధికారులు

**యాదగిరిగుట్ట, ప్రజానావ:** యాదగిరి గుట్టలో గిరి ప్రదక్షిణకు ఉన్న డిమాండ్‌తో మళ్లీ దానిని ప్రవేశ పెట్టే ఆలోచనలో ఆలయ అధికారులు ఉన్నారు. ఈ దివ్యక్షేత్రాన్ని దేశంలోని ఇతర దివ్యక్షేత్రాల్లోని మరే ఆలయానికీ తీసిపోని రీతిలో వివిధ శిల్పకళా శైలుల వైభవం ఒకేచోట భక్తులకు కనువిందు చేసేలా అత్యంత అపురూపంగా పునర్నిర్మించారు. ఆలయ ఆలయ పునర్ నిర్మాణంతో గిరి ప్రదక్షణ చేసేందుకు భక్తులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడగానే యాదగిరిగుట్టలో ఉన్న పాత ఆచారాలను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకుంది. గిరి ప్రదక్షిణ అనగానే మనకు గుర్తుకువచ్చేది 14 కిలోమీటర్ల అరుణాచల గిరిప్రదక్షిణ. మహిమాన్విత స్వయంభు యాదగి రిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని భక్తులు గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం ఏళ్లుగా సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ యాదాద్రి గిరి ప్రదక్షణకు కూడా అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. యాదగిరిగుట్ట కొండపై జ్వాలా నారసింహుడు, గండభేరుండ నారసింహుడు, యోగ నారసింహుడు, ఉగ్ర నరసింహుడు, లక్ష్మీ నరసింహుడు స్వయంభువులుగా వెలసిన పంచ నారసింహ క్షేత్రంగా ఎంతో ప్రసిద్ధి. ఎన్నో ఏళ్లుగా స్థానిక భక్తులు మాత్రమే గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం జరుగుతోంది. అయితే 2016లో కోట్లాది రూపాయలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఇందులో బాగానే కొండపై స్వామివారి సన్నిధిలో భక్తులకు బస చేసే అవకాశం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకోవడం, కొండపైకి ఆటోలను అనుమతించడం వంటి అంశాలను పునరుద్ధరించింది.

# ఇక పకడ్బందీగా రేషన్ పంపిణీ

- బియ్యంతో పాటు పప్పులు,ఉప్పులు
- పరిశీలన చేస్తున్న కూటమి ప్రభుత్వం



**అమరావతి, ప్రజానావ:** తెలుగుదేశం నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదల కు ఇచ్చే రేషన్‌ను ఇక మరింత పకడ్బందీగా చేయాలని ఆలోచిస్తోంది. అధికారంలోకి వచ్చి రాగానే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏడాది నుంచి కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి కందిపప్పుతో పాటు పంచదార సరఫరా చేయాలని భావిస్తోంది. కందిపప్పును వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో సామాన్యులు ఏడాది నుంచి బహిరంగ మార్కెట్లలో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తమ ప్రభుత్వం పేదలు, లబ్దిదారులతో పాటు అన్ని వర్గాల వారికి సంక్షేమంతో పాటు అభివృద్ధిపై దృష్టి పెట్టనుందని చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ క్రమంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు ఇవ్వడం లేదని ఆరోపణలు వచ్చాయి. మార్కెట్‌లో దరలు పెరిగినందను పేదలకు అందుబాటులో నిత్యావసరాలు తీసుకుని వచ్చే క్రమంలో మరిన్ని సరుకులు అందించే ఆలోచన చేస్తున్నారు. ఇందుకు డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. సత్వరమే సరఫరా మొదలు పెట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు కదిలారు. కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు తరలిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, పంచదారను రేషన్ షాపులకు సరఫరా చేయాల్సి ఉంది. జులై 1వ తేదీ నుంచి తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదారను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ లోకి వచ్చిన కందిపప్పు, చక్కెరతో పాటు అక్కడి సరుకుల నాణ్యతను అధికారులు పరిశీలిస్తున్నారు. పీ ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాదెండ్ల మనోహర్ రెండు రోజుల కిందట తెనాలిలో తనిఖీలు చేపట్టారు. అంగన్‌వాడీలకు ఇచ్చే కందిపప్పు, నూనెతో పాటు వైట్ రేషన్ కార్డుదారులకు ఇచ్చే పంచదారలో ఎక్కడ చూసిన తక్కువ తూకంతో సరుకులు పంపిణీ జరుగుతోందని గుర్తించారు. కందిపప్పు, నూనె అయితే 50 నుంచి 100 గ్రాములు తక్కువ ఉందని నిల్వ గోదాములను తనిఖీ చేసినప్పుడు వెల్లడైంది. అనంతరం మంగళగిరిలోనూ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు చేయించారు. అక్కడ సైతం నిర్దేశిత పరిమాణం కంటే తక్కువ తూకంతో పంపిణీ జరుగుతున్నట్లు తేలింది. ఈ క్రమంలో ఏపీ వ్యాప్తంగా కందిపప్పు, పంచదార, నూనె ప్యాకెట్ల పంపిణీ నిలిపేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించడం తెలిసిందే. ఈ అవకతవకలు జరగడానికి కారణాలపై రెండు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ నెల రేషన్ లో సరుకుల జాబితాను సిద్ధం చేయబోతున్నారు.




# పూరన్ విధ్వంసం

## అఫ్గాన్‌పై విండీస్ ఘన విజయం

**సెయింట్ లూసియా:** టీ20 ప్రపంచకప్ గ్రూప్-సీలో భాగంగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య వెస్టిండీస్ 104 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్‌ను వికెట్ కీపర్ నికోలస్ పూరన్ విధ్వంసక బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. పూరన్ వీర విధ్వంసం సృష్టించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 218 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. తర్వాత లక్ష్ఛేదనకు దిగిన అఫ్గానిస్థాన్ 16.2 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అఫ్గాన్‌కు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ రహమానుల్లా గుర్బాజ్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన గుల్బదిన్ నైబ్ (7) కూడా నిరాశ పరిచాడు. అయితే ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్‌జయ్ కాస్త మెరుగైన బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలిచారు. ఇబ్రహీం 28 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 38 పరుగులు సాధించాడు. అజ్మతుల్లా ఒక ఫోర్, సిక్సర్‌తో 23 పరుగులు చేశాడు. మిగిలిన వారిలో కరీమ్ జన్నత్ (14), కెప్టెన్ రషీద్ ఖాన్ (18) మాత్రమే రెండంకెల స్కోరును అందుకున్నారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడంతో అఫ్గాన్ ఇన్నింగ్స్ 114 పరుగులకే పరిమితమైంది. కరీబియన్ టీమ్ బౌలర్లలో అకిల్ హుస్సేన్, మోటి రెండేసి వికెట్లను పడగొట్టారు. ఒబెద్ మెక్‌కాయ్‌కి మూడు వికెట్లు దక్కాయి.

### చెలరేగిన పూరన్

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌ను వికెట్ కీపర్ నికోలస్ పూరన్ విధ్వంసక బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. అతనికి ఓపెనర్ చార్లెస్ అండగా నిలిచాడు. ఇద్దరు దూకుడైన బ్యాటింగ్‌ను కనబరచడంతో విండీస్ స్కోరు వేగంగా పరిగెత్తింది. చెలరేగి ఆడిన చార్లెస్ 27 బంతుల్లోనే 8 ఫోర్లతో 43 పరుగులు చేశాడు. ఇక దూకుడును ప్రదర్శిన పూరన్ పరుగుల వరద పారించాడు. అఫ్గాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన పూరన్ వరుస ఫోర్లు, సిక్సర్లతో హోరెత్తించాడు. అతన్ని కట్టడి చేసేందుకు ప్రత్యర్థి జట్టు బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అజ్మతుల్లా వేసిన నాలుగో ఓవర్‌లో పూరన్ ఏకంగా 26 పరుగులు రాబట్టాడు. ఈ ఓవర్‌లో విండీస్‌కు రికార్డు స్థాయిలో 36 పరుగులు లభించడం విశేషం. కాగా, విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన పూరన్ రెండు పరుగుల తేడాతో సెంచరీ చేసే ఛాన్స్‌ను కోల్పోయాడు. దూకుడుగా




బ్యాటింగ్ చేసిన పూరన్ 53 బంతుల్లోనే ఆరు ఫోర్లు, 8 సిక్సర్లతో 98 పరుగులు చేసి ఔటయ్యాడు. షాయ్ హోప్ (25), కెప్టెన్ రొమన్ పొవెల్ (26) కూడా చెలరేగి ఆడడంతో విండీస్ స్కోరు 218 పరుగులకు చేరింది. కాగా ప్రపంచకప్ లీగ్ దశలో విండీస్ ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ విజయం సాధించి సూపర్8కు చేరుకుంది. అఫ్గాన్ మూడు విజయాలతో రెండో స్థానంలో నిలిచి ప్లేఆఫ్ బెర్త్‌ను దక్కించుకుంది.




# సిరీస్‌పై హర్మన్ సేన కన్ను

## నేడు సౌతాఫ్రికా మహిళలతో రెండో వన్డే

**బెంగళూరు:** ఐసీసీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సౌతాఫ్రికా మహిళా క్రికెట్ టీమ్‌తో బుధవారం జరిగే రెండో వన్డేకు ఆతిథ్య భారత జట్టు సమరోత్సాహంతో సిద్ధమైంది. ఇప్పటికే తొలి వన్డేలో భారత్ 143 పరుగుల తేడాతో రికార్డు విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. తాజాగా రెండో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ పోరుకు సిద్ధమైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన చాలా బలంగా కనిపిస్తోంది. అయితే తొలి వన్డేలో టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఫలం కావడం ఆందోళన కలిగించే అంశంగానే చెప్పాలి. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన మాత్రమే మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచింది. షఫాలీ వర్మ, హేమలత, రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్ తదితరులు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. కానీ మంధాన అద్భుత సెంచరీతో జట్టును ఆదుకుంది. ఈసారి కూడా జట్టు మంధానపై భారీ ఆశలు పెట్టుకుంది. దీప్తి శర్మ, పూజా వస్త్రాకర్‌లు ఆల్‌రౌండ్‌షోతో అలరించారు. ఈ మ్యాచ్‌లో కూడా సత్తా చాటాలనే లక్ష్యంతో ఉన్నారు. బౌలింగ్‌లో కూడా భారత్ బలంగా ఉంది. రేణుకా సింగ్, దీప్తి, పూజా, రాధా యదవ్, శోభన వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు జట్టులో ఉన్నారు. దీంతో ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. మరోవైపు సౌతాఫ్రికాను కూడా తక్కువ అంచనా వేయలేం. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే క్రికెటర్లకు జట్టులో కొదవలేదు. సమష్టిగా రాణిస్తే ఈ మ్యాచ్‌లో గెలవడం సౌతాఫ్రికా టీమ్‌కు అసాధ్యమేమీ కాదు. దీంతో భారత్ ఏమాత్రం నిర్లక్ష్యంగా ఆడిన భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

# టీ20 ప్రపంచకప్‌లో ఫిక్సింగ్ కలకలం!

**గయానా:** వెస్టిండీస్, అమెరికాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ అంశం కలకలం సృష్టించింది. మ్యాచ్ ఫిక్సింగ్ కోసం కెన్యాకు చెందిన ఓ మాజీ క్రికెటర్ ఉగాండా జట్టు సభ్యుడిని సంప్రదించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని ఉగాండా క్రికెటర్ వెంటనే ఐసీసీ అవినీతి నిరోధక అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఈ ప్రపంచకప్‌లో ఉగాండా టీమ్ మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడిన విషయం తెలిసిందే. కాగా, కెన్యాకు చెందిన మాజీ ఫాస్ట్ బౌలర్ ఒకరు మ్యాచ్ ఫిక్సింగ్ కోసం ఉగాండా క్రికెటర్లను వేర్వేరు నంబర్లతో పలుమార్లు సంప్రదించడానికి ప్రయత్నించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని సంబంధిత క్రికెటర్ ఐసీసీ దృష్టికి తీసుకెళ్లాడు. ఇదిలావుంటే ఫిక్సింగ్ అంశం తెరపైకి రావడంతో ఐసీసీతో సహా ఇతర జట్ల క్రికెట్ బోర్డులు షాక్‌కు గురయ్యాయి. మరోవైపు ఈ విషయంపై విచారణ జరపాలని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అధికారులు నిర్ణయించారు. గ్రూప్‌సీలో ఉన్న ఉగాండా 4మ్యాచ్‌లు ఆడి ఒక విజయాన్ని మాత్రమే సొంతం చేసుకుంది.




## ముగిసిన కబడ్డీ పోటీలు

**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు ముగిసాయి. హైదరాబాద్ పాతబస్తీలోని ఆలె నరేంద్ర స్పోర్ట్ కాంప్లెక్స్ వేదికగా ఈ పోటీలు జరిగాయి. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు, క్లబ్‌లు, ఇన్‌స్టిట్యూషన్‌లకు చెందిన జట్లు పోటీ పడ్డాయి. కాగా, స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) జట్టు ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. ఛాంపియన్ టీమ్‌కు రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ ట్రోఫీని బహూకరించారు.

## ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్‌కు

# టీమిండియా బంపర్ ఆఫర్?




**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ జాక్‌పాట్ కొట్టేసాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన ఈ పంజాబ్ ఆటగాడు తొలిసారి టీమిండియా పిలుపు అందుకున్నాడు. వచ్చే నెల ఐదు టీ20ల సిరీస్ కోసం జింబాబ్వే పర్యటనకు వెళ్లే భారత జట్టులో అభిషేక్ శర్మకు చోటు దక్కే అవకాశం ఉంది. ఈ పర్యటన నుంచి టీ20 ప్రపంచకప్ 2024 ఆడిన సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినవ్వనున్నారు. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో సత్తా చాటిన ఆటగాళ్లతో కూడిన యంగ్ టీమ్‌ను జింబాబ్వేకు పంపించాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐపీఎల్ 2024 సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన అభిషేక్ శర్మతో పాటు రియాన్ పరాగ్, మయాంక్ యాదవ్, హర్షిత్ రాణా, నితీష్ రెడ్డి, విజయ్‌కుమార్ వైశాఖ్, యశ్ దయాల్‌లకు కూడా టీమిం డియా నుంచి పిలుపు వచ్చింది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)కు రావాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కుర్రాళ్లతో పాటు కాస్త సీనియర్ ఆటగాళ్లు అయిన శుభ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఆవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్‌లకు కూడా జింబాబ్వే పర్యటనకు వెళ్లే భారత జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. కొత్త కోచ్ పర్య వేక్షణలో టీమిండియా ఈ పర్యటనకు వెళ్లనుంది. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవి కాలం టీ20 ప్రపంచకప్ 2024తో ముగియనుంది. ఒకవేళ గంభీర్ కొత్త కోచ్‌గా ఎంపికైనా.. జింబాబ్వే పర్యటనతోనే బాధ్యతలు తీసుకుంటాడా? లేక ఎన్‌సీఏ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తాడా? అని తేలాల్సి ఉంది జూలై 6 నుంచి 14 వరకు జింబాబ్వేలో యంగ్ ఇండియా పర్య టించనుంది. ఇరు జట్ల మధ్య తొలి టీ20 జూలై6న, రెం డో టీ20 జూలై 7న, మూడో టీ20 జూలై 10న, నాలుగో టీ20 జూలై 13న, ఐదో టీ20 జూలై 14న జరగనుంది.




# వీడ్కోలు పలకడం అంతిమ యాత్రలాంటిది

## రోజర్ ఫెదరర్ సంచలన వ్యాఖ్యలు

**స్విట్జర్లాండ్:** టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఆటకు వీడ్కోలు పలికి రెండేండ్లు అవుతోంది. అయినా సరే ఈ లెజెండ్ తన టెన్నిస్ జీవితాన్ని మర్చిపోలేకపోతున్నాడు. ఈమధ్యే ఫెదరర్ తన జీవితంపై ఒక డాక్యుమెంటరీ వస్తుందని చెప్పిన విషయం తెలిసిందే. 'ఫెదరర్ ట్వెల్ ఫైనల్ డేస్' అనే పేరుతో అమెజాన్ ప్రైమ్ రూపొందిన ఈ డాక్యు మెంటరీ అతడి కెరీర్‌లోని ఆఖరి 12 రోజులకు సంబంధిం చినది. తన జీవితంలోని ముఖ్యమైన దశ డాక్యుమెంటరీగా వస్తోన్న నేపథ్యంలో ఫెదరర్ ప్రమోషన్‌లో పనుల్లో బిజీ అయ్యాడు. అందులో భాగంగానే అతడు మాట్లాడుతూ.. రిటైర్మెంట్ అనుభవాన్ని పంచుకున్నాడు. ఒక ఆటగాడి తన కెరీర్‌కు వీడ్కోలు పలకడం అనేది ఓరకంగా అంతిమ యాత్ర లాంటిది. ప్రపంచ టెన్నిస్‌లో ఫెదరర్ ఓ శిఖరం. ప్రీట్ సాంప్రాస్, ఆండీ రాడిక్‌ల శకం నడుస్తున్న రోజుల్లో దూసుకొచ్చిన ఈ స్విట్జర్‌లాండ్ కెరటం అనతికాలంలోనే తన ముద్ర వేశాడు. పురుషుల సింగిల్స్‌లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించాడు. ఒకానొక దశలో టోర్నీ ఏదైనా సరే ట్రోఫీ ఫెదరర్‌దే అని అనుకునేవాళ్లంతా. రఫెల్ నాదల్, నొవాక్ జకోవిచ్, ఆండీ ముర్రేలు ఎంట్రీ ఇవ్వడంతో అప్పటిదాకా సాగిన ఫెదరర్ ఏక ఛత్రాధిపత్యం తగ్గడం మొదలైంది. దానికి తోడు పెరుగుతున్న వయసు, గాయాలు ఈ స్టార్ ఆటగాడిని విశ్రాంతి తీసుకు నేలా చేశాయి. చివరకు 2022లో కన్నీటిపర్యంతమవుతూ తనకెంతో ఇష్టమైన ఆటకు ఫెదరర్ రిటైర్మెంట్ ప్రకటించాడు. అక్కడితో టెన్నిస్‌లో ఓ శకం ముగిసిపోయింది. తన సొగసైన ఆటతో కెరీర్‌లో 20 గ్లాండ్‌స్లామ్స్ టైటిళ్లు కొల్లగొట్టిన ఫెదరర్ ఇప్పుడు.. డాక్యుమెంటరీతో మరోసారి అభిమానుల ముందుకు వస్తున్నాడు. జూన్ 20వ తేదీన ఈ మహాయోధుడి డాక్యుమెంటరీ విడుదల కానుంది.

# ఉప్పల్ స్టేడియం విద్యుత్ బకాయిల చెల్లింపు

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు



**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** దాదాపు దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం విద్యుత్ బిల్లు బకాయిలకు సంబంధించిన సమస్యకు తెరపడింది. ఉప్పల్ స్టేడియానికి సంబంధించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను మంగళవారం హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) చెల్లించింది. ఈ మేరకు హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు మొత్తం బకాయిలకు సంబంధించిన కోటి 64 లక్షల రూపాయల చెక్కును సంబంధిత విద్యుత్ అధికారులకు అందజేశారు. దీంతో దాదాపు పదేళ్లుగా ఉన్న సమస్యకు ఫుల్‌స్టాప్ పడింది. జగన్‌మోహన్ రావు, హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్ నేతృత్వంలోని కార్యవర్గం ఈ అంశానికి సానుకూల పరిష్కారం కనుగొంది. మొత్తం బకాయిలను ఒకేసారి చెల్లించాలని హెచ్‌సీఏ పాలక వర్గం నిర్ణయించింది. తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ ఫరూఖీని కలిసి జగన్‌మోహన్ రావు దీనికి సంబంధించిన చెక్కును అందజేశారు. మరోవైపు ఐపీఎల్ జరుగుతున్న సమయంలో కొంతమంది అధికారులు కావాలనే విద్యుత్ సరఫరాను నిలిపి వేసి హెచ్‌సీఏ పరువును తీశారని, దీనికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జగన్‌మోహన్ రావు సీఎండీ ఫరూఖీని కోరారు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116